# రచయితల పరిచయం

**౧. డా అపర్ణ యేలూరిపాటి**

ఎం.ఏ.పిహెచ్.డి చేసిన అపర్ణగారు ౨౦ సంవత్సరాలు ఉపాధ్యాయురాలిగా పని చేసారు. ప్రస్తుతం అన్వేషణలో ఉన్నారు. పద్య-గేయ-కథా-వ్యాస పాఠ్యరచయిత్రిగా, ఆకాశవాణి, టివి తదితర సాహితీ వేదికలపై, వివిధ పత్రికల్లోకూడ రచనా వ్యాసంగం కొనసాగించారు. ప్రస్థుతం పుస్తకాలతో కుస్తీ, కంప్యూటర్‌తో కాలక్షేపం

**౨. ఇందిర మాలెంపాటి**

గుంటురు మెడికల్ కాలేజ్ నుంచి పట్టభద్రులై, గైనకాలజీ ఆబ్‌స్టెట్రిక్స్ లో ఎం.డి చేసిన ఇందిర భర్త డా.శ్రీహరి గారితో కలిసి ౧౯౭౨ లో అమెరికా వచ్చారు. ౩౨ యేళ్ళ ప్రాక్టీసు తర్వాత ప్రస్తుతం అట్లాంటాలో నివాసం. తెలుగు, హిందిలో అనేక ఆలిండియా రేడియో డ్రామాలలో పాల్గొన్న వీరికి చదవటం, కథలు వ్రాయటం, ప్రయాణాలు చేయటం, తమ మనుమలతో అనందంగా గడపటం చాలా ఇష్టం.

**౩. ఉప్పల అనంతసుధాకర్**

భార్య శైలజ,అమ్మాయిలు ఆలేఖ్య, అమూల్యలతో న్యూజెర్సీలో నివాసం. వృత్తిరీత్యా సాఫ్ట్ వేర్ ఇంజనీర్. తెలుగు సాహిత్యం అంటే చాలా ఇష్టం. అప్పుడప్పుడు చిన్న చిన్న కవితలు, కథలు వ్రాయడం చేస్తుంటారు. పదేళ్ళకు పైగా తెలుగు కళాసమితి, తెలుగు జ్యోతులతో అవినాభావసంబంధం.

**4. పద్మశ్రీ ఎస్.వి. రామారావు**

ప్రముఖ చిత్రకారుడు, రచయిత రామారావుగారు ౧౯౩౬ సంవత్సరములో గుడివాడ లో పుట్టారు. విద్యాభ్యాసం: ఆంధ్రా యూనివర్శిటి, మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్, స్లేడ్ స్కూల్ ఫైన్ ఆర్ట్, లండన్.

౨౦౦౨వ సంవత్సరములో భారత ప్రభుత్వము "పద్మశ్రీ" బిరుదునిచ్చింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చిత్రకారుడిగానే కాక రామారావుగారు శతాధిక వచన కవితా రచయిత. వారి కవితలు అనేక పోటీలలో బహుమతులు గెల్చుకున్నాయి. "తొలి నడకలు" అనే గేయ సంకలనం, ఇతర వచన కవితా సంకలనాలు ప్రచురించారు.

**5. ఓరుగంటి గోపాలకృష్ణ**

ఓరుగంటి గోపాలకృష్ణ భార్య వసుంధర, పిల్లలు గాయత్రి, సిద్ధార్థలతో న్యూజెర్సీలో నివాసం. నాటకాలూ, సాహిత్యమూ, చిత్రలేఖనాలంటే ఆకాశమంత ఇష్టమూ, ఆవగింజంత ప్రవేశము. సగోత్రీకుడని కాబోలు బొమ్మెర పోతన అంటే వల్లమాలిన అభిమానం.

**౬.కలశపూడి శ్రీనివాసరావు**

కలశపూడి శ్రీనివాసరావు గారు వృత్తి రీత్యా బయోటెక్నాలజిస్ట్. ఆంధ్రా యూనివర్సిటిలో ఎమ్మెస్సీ, పారిస్ యూనివర్సిటీలో పి.హెచ్.డి చేసి ప్రస్తుతం న్యూయార్క్ లో పనిచేస్తున్న వీరు "కాటలిస్ట్" పత్రికకు సంపాదకులు. తొంభైలలో టిఫాస్ కమిటీ మెంబరు కూడా. వీరి భార్య డా.వసుంధర స్వయంగా రచయిత్రి, సంఘసేవకురాలు, "ఇండియాహోం" సంస్థాపకురాలు. వీరి పిల్లలు భారతి, లక్ష్మణ్ కూడా టిఫాస్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు.

**7. కాశీనాధుని రాధ**

పూర్వం ఎప్పుడో ఇండియాలో ఉండగా కాలేజీలో తెలుగు పాఠాలు చెప్పడం. గతపదేళ్ళుగా చేస్తున్న పనులు: వాలంటీర్ చేయడం, చిన్నపిల్లలకి తెలుగు పాఠాలు చెప్పడం, అప్పుడప్పుడు తెలుగు జ్యోతికి కథలలాంటివి రాయడం. రచనలనే పేరుతో చేసే ప్రయోగాలని ఓపిగ్గా విని భరించే శ్రీవారు సాంబశివరావు, అమ్మాయి మాధవిలతోను, అబ్బాయి శరత్ తోను డోవర్ న్యూజెర్సీలో నివాసం.

**8. కాళ్ళకూరి సాయిలక్ష్మి**

ఫిలాసఫీ లో ఎమ్మే ,స్పెషల్ ఎడ్యు కేషన్ లో ఎమ్మెడ్ చేసి, స్పెషల్ ఎడ్యుకేటర్‌గా చాలాసంవత్సరాలు పనిచేసిన కాళ్ళకూరి సాయిలక్ష్మిగారు మోర్గన్‌విల్ న్యూజెర్సీలో ఉంటారు. కథలు, గేయాలు, వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురించారు. "తెలుగు లాలిత్యము - ప్రవాసాంధ్రభాషాబోధిని" అనే పాఠ్యపుస్తకాన్ని వ్రాసారు.

**౯. కొమరవోలు సరోజ**

ఈనాటి ప్రకాశం జిల్లా కడవకుదురు లో జన్మించి, తెలుగుసాహిత్యంలో, హిస్టరీలో ఎం.ఏ డిగ్రీలను, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో బి.ఎ చేసిన సరోజ గారు ప్రస్తుతం తమ భర్త రావు గారి తో కలసి కెనడాలోని టొరోంటో లో ఉంటున్నారు. సంతానం-కిషోర్,పద్మజ, శిరీష. ఇప్పటివరకు ౨౦౦ కథలు, 5౦ వ్యాసాలు, ౨ నవలలు ప్రచురించి,అనేక పురస్కారాలు పొందిన సరోజగారు కొన్నాళ్ళు "వనితాజ్యోతి" కరస్పాండెంట్ ఉండి "తెలుగుతల్లి" పత్రిక కూడా నడిపారు. ఈమె హాబీ ఫ్రెష్ ఫ్లవర్ అరేంజ్మెంట్.

**౧౦. కోవెల వసుధ**

కోవెల వసుధ గారి స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం సీనియర్ ప్రోగ్రామర్‌గా వర్జీనియాలో నివాసం. పుస్తకాలు చదవటం, కవిత్వం వ్రాయటం, తోటపని, అల్లికలు అభిరుచులు. ఈమె తండ్రిగారు తోమల కె.వి.రాఘవాచార్యులు,మామగారు కోవెల సంపత్కుమారాచార్యులు కూడా ప్రముఖ రచయితలు

**౧౧. గిరిజాశంకర్ చింతపల్లి**

౧౯4౨ లో భీమునిపట్టణం లో పుట్టారు . గుంటూరు మెడికల్ కాలేజిలో చదివారు. ప్రస్తుతం అమెరికాలో టెంపుల్ టెక్సాస్ లో వానప్రస్థాశ్రమం. కథలు, పద్యాలు వ్రాస్తుంటారు. టెక్సస్ తెలుగు సాహితీ సదస్సులలో అనేక ప్రసంగాలు చేసారు

**౧౨.గొల్లపూడి మారుతీరావు**

విజయనగరంలో జన్మించి విశాఖపట్టణంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన గొల్లపూడి మారుతీరావుగారు రచయితగా, రంగస్థల, సినీ నటుడిగా తెలుగువారికి సుపరిచితులే. దాదాపు ౨౫౦ సినిమాలలో నటించిన మారుతీరావుగారు సినీరంగంలో ప్రవేశించకముందు ఆలిండియారేడియోలో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసేవారు. సాహిత్య,నాటక,సినీ రంగాలలో అనేక పురస్కారాలు, అవార్డులు పొందిన వీరు అనేక నవలలు, నాటికలు, నాటకాలు, వ్యాసాలు, కథలు వివిధ పత్రికలలో, పుస్తకాలుగా ప్రచురించారు. ప్రస్తుతం తమ కుటుంబంతో మద్రాసులో నివసిస్తున్నారు.

౧౩. **చల్లా సత్యవతి**

సత్యవతి గారు దొడ్డవరం, తూర్పు గోదావరి జిల్లాలో జన్మించి తుని రాజావారి హైస్కూలులో ఎస్సెస్సెల్సీ పూర్తి చేశారు. వీరి తండ్రిగారు తునిఎస్టేటు దివాను. ఆమె భర్త చల్లా సీతారామచంద్రంగారు కాకినాడ వాస్తవ్యులు.౧౯౮౩లో ఉద్యోగ విరమణానంతరం అమెరికాలో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. శాస్త్రీయ కర్ణాటక సంగీతమన్నా, సాహిత్యమన్నా ఎనలేని మక్కువ. తన అనుభవాలను, ఆశయాలను కథలుగా, వ్యాసాలుగా వ్రాస్తూ సాహిత్యరంగంలో యధాశక్తి కృషి చేస్తున్నారు.

౧4. **జి.వి. ఆర్.కె .శర్మ**

శృంగవరపుకోటలో జన్మించి, విశాఖపట్నంలో ఎం.బి.బి.ఎస్, ఢిల్లీలో ఎం.డి చేసిన డా.శర్మ గారు ప్రస్తుతం వెస్ట్ వుడ్, మాసాచ్యుసెట్స్‌లో కార్డియాలజిస్ట్‌గా పనిచేస్తూ,భార్య ఉమాదేవి, కుమార్తెలు డా.మైత్రేయి,డా.సౌమ్య లతో నివసిస్తున్నారు. వృత్తి రంగంలో ౧౫౦ పైగా పరిశోధన వ్యాసాలు, జాతీయ అంతర్జాతీయ ఉపన్యాసాలు ఇచ్చి అనేక పురస్కారాలు పొందారు. సంగీతం, తెలుగు సాహిత్యం, ఆధ్యాత్మిక చింతన అభిరుచులు. బ్రహ్మి,రచన, తెలుగుజ్యోతి, తానా, ఆటా సూవనీర్లలో అనేక కవితలు, వ్యాసాలు ప్రచురించారు.

౧5. **తమ్మినేని యదుకులభూషణ్**

ప్రవాసాంధ్ర రచయిత, విమర్శకులు, కవి తమ్మినేని యదుకుల భూషణ్ జన్మస్థలం రాయలసీమలోని చారిత్రాత్మకస్థలం తాడిపత్రి. ప్రస్తుత నివాసం సోమర్సెట్, న్యూజెర్సీ. తమ ఎనిమిదవ యేడు నుండే కవిత్వం వ్రాస్తున్న భూషణ్ గారు ఇప్పటి వరకూ ౩కవితాసంకలనాలు, ౧అనువాద సంకలనం, ౧ కథా సంకలనం, ౧సాహిత్య విమర్శాసంకలనం ప్రచురించారు. అనేక అంతర్జాల, అచ్చు పత్రికలలో తమ రచనలు విరివిగా ప్రచురించారు.

౧6. **నారాయణస్వామి**

జన్మస్థలం సిద్ధిపేట, మెదక్ జిల్లా. ఉన్నత విద్యాభ్యాసం జె.ఎన్.టి.యు హైదరాబాదులో. వృత్తి రీత్యా వీరు సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్. ప్రస్తుతనివాసం న్యూజెర్సీలో. "కల్లోల కలలమేఘం", "సందుక" కవితా సంపుటాలు వెలువరించారు. "ప్రాణహిత" వెబ్ మాగజైన్‌కి ప్రధాన సంపాదకులు.

౧7. **నిడదవోలు మాలతి**

ప్రముఖప్రవాసాంధ్ర రచయిత్రి, కవయిత్రి, బ్లాగరి నిడదవోలు మాలతి గారు గతముప్ఫై ఏళ్ళకు పైగా మాడిసన్ (విస్కాన్సిన్) లో నివసిస్తున్నారు. ఇంగ్లీషు లిటరేచర్‌లో, లైబ్రరీ సైన్స్‌లో మాస్టర్స్ చేసిన ఈమె, తన పధ్నాలుగేళ్ళ వయస్సు నుంచీ రచనావ్యాసంగం, ముఖ్యంగా కథారచన కొనసాగిస్తూ ఉన్నారు. గత ఏడేళ్ళుగా తమ స్వంత వెబ్ సైట్ 'తూలిక'లో కథలు వ్రాయటం, తెలుగు కథల్ని ఇంగ్లీషులోకి అనువదించి పబ్లిష్ చేయటం చేస్తున్నారు. గత రెండేళ్ళుగా తెలుగుతూలిక బ్లాగును నడుపుతున్నారు. అనేక కథలు, కవితలు, వ్యాసాలు వ్రాసిన వీరి రచనలు అనేక అచ్చు, వెబ్ పత్రికలలో ప్రచురితం. తెలుగులో ౧ స్వీయ కథా సంకలనం, ఇంగ్లీష్‌లో ౨ అనువాద కథల సంకలనాలు, ఇంగ్లీషులో అరవయ్యవ దశకంలోని తెలుగు రచయిత్రుల గురించిన విమర్శనాగ్రంధాన్ని ప్రచురించారు.

౧8. **నిర్మలాదిత్య**

౧౯౮౬ నుంచీ అనేక పత్రికలలో తమ కథలు ప్రచురించిన నిర్మలాదిత్య అసలు పేరు భాస్కర్ పులుకాల్. ఐ.ఐ.టి చెన్నై నుంచి పట్టభద్రులై ప్రస్తుతం అయోవాలో పనిచేస్తున్నారు. భార్య నిర్మల, కుమారుడు ఆదిత్య. ౧౯౯8లో అమెరికా వచ్చినప్పటినుండి ప్రవాసాంధ్ర జీవితంపై వీరు వ్రాసిన అనేక కథలు ఈమాట, తెలుగునాడి, కౌముది, రచనవంటి పత్రికలలో ప్రచురితమవటమే కాక వంగూరి ట్రస్ట్ వారు నిర్వహించిన సాహిత్యపోటీలలో బహుమతులు గెల్చుకున్నారు .

౧౯. **నిషిగంధ**

పుట్టింది, పెరిగింది విజయవాడలో. మయామీ యూనివర్సిటీలో సిస్టంస్ ఎనలిస్ట్‌గా పనిచేస్తున్నారు. మయామీ, ఫ్లోరిడాలో నివాసం.

౨౦. **డా . పెమ్మరాజు వేణుగోపాలరావు**

ఎమరీ యూనివర్సిటీ, అట్లాంటాలో ఫిజిక్స్ బోధిస్తూ,అటామిక్, న్యూక్లియర్ మరియు క్వాంటంఫిజిక్స్‌లో రీసెర్చ్ చేసే డా.రావు గారికి భౌతికశాస్త్రపు ఫిలాసఫీపై, సైన్స్‌కీ, మతానికీ, సంస్కృతికీ మధ్య ఉన్న పరస్పర సంకర్షణ పై ఆసక్తి. సాహిత్య, కళా, నాటకరంగాలలో క్రియాశీలమైన అభిరుచి. అనేక కళా ప్రదర్శనలను, భారతీయ శాస్త్రీయ నృత్య నాటకాలాను ప్రొడ్యూస్‌చేయటమేకాక అనేక కథలు, కవితలు ప్రచురించారు. భారతీయకళా, తత్వ హైందవ మత విషయాలలో అధ్యాపకులు కూడా. వీరి భార్య స్వరాజ్య మహాలక్ష్మి, కూతుళ్ళు నళిని, సలీనా కూడా వారివారి కళా రంగాలలో నిష్ణాతులు

౨౧. **ప్రభారఘునాథ్**

విజయవాడ మ్యూజిక్ కళాశాలలో పెమ్మరాజు సూర్యారావు గారి వద్ద కర్ణాటక సంగీతాన్ని అభ్యసించి, ప్రస్తుతం బెడ్మినిస్టర్ న్యూజెర్సీలో నివసిస్తున్న ప్రభారఘునాథ్‌గారు తమ సంగీత

ప్రతిభ ద్వారా న్యూజెర్సీ ప్రవాసాంధ్రులకు సుపరిచితులు. ప్రతి యేటా జరిగే తెలుగుకళాసమితి వారి త్రిమూర్తి సంగీతోత్సవాల నిర్వహణలో ప్రధాన పాత్ర వహించడమే కాకుండా అనేక ఔత్సాహిక విద్యార్థులకి కర్ణాటకసంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రభా రఘునాథ్ తెలుగుజ్యోతి సంస్థాపక సంపాదకులు, అనేక సంవత్సరాలు తెలుగుకళాసమితిలో క్రియాశీలక పాత్ర వహించిన స్వర్గీయ కిడాంబి రఘునాథ్ గారి సతీమణి. గత పాతికేళ్ళుగా సమితి సభ్యులు.

22. **బేతనపల్లి బోస్**

గుడివాడ కృష్ణాజిల్లాలో పుట్టి, న్యూయార్క్‌లో బోర్డ్ సర్టిఫైడ్ ఆర్థాటిస్ట్ ప్రొస్థటిస్ట్‌గా పనిచేస్తూ ఫెయిర్ లాన్, న్యూజెర్సీలో భార్య శశికళ, కొడుకు హరీష్‌తో నివసించే బోస్ గారికి అప్పుడప్పుడు సరదాగా రాయటం ప్రవృత్తి.

23. **భమిడిపాటి కామేశ్వరి**

భమిడిపాటి కామేశ్వరి గారి స్వస్థలం విజయనగరం జిల్లాలోని ఒక గ్రామం. ప్రస్తుతం భర్త సాంబమూర్తిగారితో కలసి అమెరికాలో పిల్లలవద్ద ఉంటున్నారు. తీరికవేళల్లో పెయింటింగులు వేయటం, కవితలు వ్రాయటం, వివిధ ప్రవాసాంధ్ర పత్రికలకు తమ రచనలు పంపటం వీరి అభిరుచులు. ఆమె కవిత "స్టాట్యూ ఆఫ్ లిబర్టీ" కి 2008 - ఆటా వారి సూవనీర్ లో రెండవ బహుమతి లభించింది.

24. **భారతి భావరాజు**

పెరిగినది బోంబేలో. అక్కడే బి.ఎస్సీ చదివారు. 1965లో శ్రీభావరాజు పరబ్రహ్మమూర్తిగారితో వివాహం అయింది. 1987-2005 వరకు పార్సిపన్నీ హైస్కూల్ లైబ్రరీలో పనిచేశారు. చిత్రకళలో ప్రవేశం. తెలుగు, ఇంగ్లీషులో చిన్న వ్యాసాలు వ్రాయడం, సంగీత సాహిత్యాల మీద మక్కువ. ఇద్దరు కుమార్తెలు. రజిత, వసుధ అమెరికాలో పుట్టి పెరిగారు. వివాహాలయి వారి కుటుంబాలతో ఇక్కడే స్థిరపడ్డారు.

25. **మంథా భానుమతి**

కొంత కోనసీమలో మరికొంత గుంటూరులో బాల్యం గడిపి, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కర్నాటక సంగీతంలో డిప్లమా పొంది, రసాయనశాస్త్ర అధ్యాపకురాలిగా ప్రభుత్వ సిటీ కళాశాలనుంచి 2000 సం. లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన మంథా భానుమతి గారికి తెలుగు, ఇంగ్లీష్ పత్రికలు, నవలలు చదవడం. శాస్త్రీయ సంగీతం పాడడం, వినడం అభిరుచులు. తెలుగుజ్యోతి సర్వధారి ఉగాది ప్రత్యేక సంచిక కథలపోటీలో ద్వితీయ బహుమతి గెల్చుకున్న వీరు సుమారు పది కథలు, పది విజ్ఞా న శాస్త్ర వ్యాసాలు, రెండు సాంఘిక వ్యాసాలు ప్రచురించారు. రచన, స్వాతి, ఆంధ్రభూమి పత్రికలలో నవలలు బహుమతులు గెల్చుకున్నాయి. ఒక నవల కౌముది వెబ్ పత్రికలో వస్తోంది.

26. **డా: యేలూరిపాటి అంజనేయశర్మ**

అంజనేయశర్మ సంస్కృతాంధ్రాలలో, ఫిలాసఫీలో ఎం.ఏ చేసి 23 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా పనిచేసారు. రచనా వ్యాసంగం, ఆధ్యాత్మిక సాహిత్యప్రసంగాలు, సేవాసంస్థల నిర్వహణ ఆసక్తులు. విద్యాభారతి, సాహిత్యకళాభిజ్ఞ బిరుదులు పొందారు. వక్తగా, వ్యాఖ్యాతగా, పద్య-శ్లోక-గేయ-వ్యాస-నాటక రచయితగా, ఆలిండియారేడియో, దూరదర్శన్, ఈటీవి వివిధ ఛానల్స్‌లో, వేదికలపై, పత్రికల్లో పేరుపొందారు.

27. **రాధిక నోరి**

అమెరికాలోని తెలుగువారందరికి తన సంగీత సాహిత్యాల ద్వారా సుపరిచితులే! ఈమె హైదరాబాదులో చాలా కాలం - ఆలిండియా రేడియోలో స్టాఫ్ఆర్టిస్ట్‌గా పనిచేసేవారు. ప్రస్తుతం ఫ్లోరిడాలోని టల్లహాసి నగరంలో డిపార్ట్ మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌ఫర్మేషన్‌లో పని చేస్తున్నారు. సంగీత సాహిత్యాలంటే మక్కువ ఎక్కువ. మనందరి భావాలని, బంధాలని, సమస్యలనీ, సంఘటనలని అందరికీ తేలికగా అర్థం అయ్యే భాషలో చెప్పటం ఈమె కథల ముఖ్య ఉద్దేశం. అనేక కథల పోటీలలో బహుమతులు కూడా వచ్చాయి. అనేక పట్టణాలలో, సందరాలలో సంగీత ప్రదర్శనలు ఇచ్చి వున్నారు. బ్రతుకంతా పాడాలని, పాడుతూ బ్రతకాలని ఈమె కోరిక.

28. **రెంటాల కల్పన**

తన తండ్రి, ప్రముఖ రచయిత రెంటాల గోపాలకృష్ణ గారి నుంచి సాహిత్యాభిలాషను వారసత్వంగా పొంది, ఆకాశవాణి, దూరదర్శన్‌లలో న్యూస్ రీడర్‌గా, ఆంధ్రజ్యోతిలో జర్నలిస్ట్‌గా పనిచేసిన ప్రసిద్ధ స్త్రీవాద రచయిత్రి రెంటాల కల్పనగారు స్వయానా కవయిత్రి, సాహితీ విమర్శకులు కూడా. వీరి "నేను కనిపించే పదం" కవితా సంపుటికి ప్రతిష్టాత్మకమైన అజంతా పురస్కారం లభించింది. 2003 నుండి అమెరికాలో నివసిస్తున్న వీరు "ప్రవాసాంధ్ర స్త్రీ జీవితం - సాహిత్యం" పై దృష్టి సారించి అనేక కథలు, విమర్శలు వ్రాస్తున్నారు.

29. **వారణాసి నాగలక్ష్మి**

స్వస్థలం నూజివీడు (కృష్ణాజిల్లా ) సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాదులో కెమిస్ట్రీలో ఎం.ఫిల్ చేసి కొంతకాలం లెక్చరర్ గా పనిచేసారు. ప్రస్తుతం తమ ఖాళీ సమయాన్ని,పెయింటింగ్, సృజనాత్మక రచనలకు వినియోగిస్తున్నారు.

30. **విన్నకోట రవిశంకర్**

ప్రవాసాంధ్ర కవి, రచయిత, విమర్శకులు రవిశంకర్ గారు 'కుండీలో మర్రిచెట్టు', 'వేసవి వాన' అనే పేరొందిన కవితా సంకలనాలు ప్రచురించారు.. అభిమానకవి ఇస్మాయిల్‌గారు. భార్య శ్రీకళ, కూతురు హిమబిందులతో గత పదేళ్ళుగా కొలంబియా లో నివాసం.

31. **విష్ణుభొట్ల లక్ష్మన్న**

పశ్చిమ గోదావరి జిల్లా సరిపల్లె లో జన్మించి, ఐ.ఐ.టి బాంబే లో ఇంజనీరింగ్ చేసి, ఆస్టిన్, టెక్సాస్‌లో రిసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న లక్ష్మన్నగారికి సంగీతం, సాహిత్యం, నాటకరంగం,

పుస్తకపఠనం అభిరుచులు. అభిమాన రచయితలు శ్రీపాద, కొడవటిగంటి, కారా, రావిశాస్త్రి, విశ్వనాథ. ప్రముఖ వెబ్ మాగజైన్ "ఈమాట" వ్యవస్థాపక సంపాదకులలో ఒకరైన లక్ష్మన్నగారు విభిన్న విషయాలపై దాదాపుగా ఇరవై వ్యాసాలు ప్రచురించారు.

౩౨. **వేమూరి వేంకట రామనాథం**

స్వగ్రామం చల్లపల్లి. ఉన్నత విద్యాభ్యాసం ఆంధ్రా యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఇకనామిక్స్. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ బిజినెస్ మానేజ్మెంట్ శాఖకి డీన్‌గా సుమారు ఇరవై ఏళ్ళు. ఇరవయ్యేళ్ళు. UNDP లో ఇంటర్రీజనల్ నెట్ వర్క్ కో-ఆర్డినేటర్‌గా సుమారు ఇరవయ్యేళ్ళు పనిచేసారు. సాహిత్య రంగంలో విశేష కృషిచేసి 'స్వాతంత్ర్య సిద్ధి', 'రామాయణ స్మృతులు' వంటి అనేక పుస్తకాలను ప్రచురించారు.

౩౩.**డా.వైదేహి శశిధర్**

జన్మస్థలం గుంటూరు జిల్లా నరసరావుపేట. మెడికల్ విద్యాభ్యాసం ఆంధ్రామెడికల్ కాలేజ్, విశాఖపట్టణం. భర్త శశిధర్, చిన్నారులు యామిని, జాహ్నవిలతో న్యూజెర్సీలో నివాసం. సంగీతం, సాహిత్యం, ముఖ్యంగా కవిత్వం అభిరుచులు. "నిద్రిత నగరం" కవితా సంకలనాన్ని ప్రచురించారు. అభిమాన కవి తిలక్.

౩౪. **వంగూరి చిట్టెన్ రాజు**

కాకినాడలో జన్మించి,బొంబే ఐ.ఐ.టి లో ఇంజనీరింగ్ లో డాక్టరేట్ చేసి గత ముప్పై ఏళ్ళగా హ్యూస్టన్ లో నివసిస్తున్న చిట్టెన్ రాజు గారు 'అమెరికా హాస్య బ్రహ్మ"గా అందరికీ పరిచితులే.పాతిక హాస్య నాటికలు,యాభై కథలూ,వందకుపైగా వ్యాసాలు వ్రాసిన చిట్టెన్ రాజుగారు గతంలో అటు తానాపత్రికకీ, ఇటు ఆటా వారి అమెరికాభారతికీ ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఏకైక ప్రవాసాంధ్ర రచయిత! ౧౯౯౪ నుంచి "వంగూరి ఫౌండేషన్" ను స్థాపించి ఉగాది పోటీలూ సాహితీ సదస్సులు నిర్వహిస్తున్న ఈయనకు తెలుగుభాష, సాహిత్యం అంటే వల్లమాలిన అభిమానం. వేగ్నేశా ఫౌండేషన్‌వారి వికలాంగుల సేవాసంస్థకు అమెరికాలో సంధాన కర్త.

౩౫. **డా.శారదాపూర్ణ శొంఠి**

సంస్కృతాంధ్రాలలో పండితులు, రచయిత్రి, కవయిత్రి, గాయని, "బ్రహ్మి" సాంస్కృతిక పత్రికకు సంపాదకులు అయిన డా.శొంఠి శారదాపూర్ణ గారు తెలుగు సంస్కృతి,భారతీయ కళ, తత్వశాస్త్రం పట్ల గాఢమైన అనురక్తి కలవారు. భారతదేశంలో అమెరికాలో సంగీత, సాహిత్య, విద్యా రంగాలలో అనేక పురస్కారాలు పొందిన ఈ "సంగీత కళాప్రపూర్ణ" స్వీయ కవితా సంకలనాలు, వివిధ విషయాలపై థీసిస్‌లు, అనువాదాలు, ఇతర రచనలు ప్రచురించారు. భర్త డా.శొంఠి శ్రీరాంతో కలసి చికాగోలో నివాసం.

౩౬. **శ్యామలాదేవి దశిక**

౧౯౭౬ నుంచి శ్రీవారు రామకృష్ణతో న్యూజెర్సీలో నివాసం. శ్యామలగారికి ప్రవాసాంధ్రుల జీవితాల్ని ప్రతిబింబించే రచనలంటే చాలా ఇష్టం. అమెరికా ఇల్లాలి ముచ్చట్లు శీర్షికతో ఆవిడ రాసిన కధలు తెలుగు జ్యోతి పాఠకులకి సుపరిచితం. వాళ్ళ అమ్మాయి జ్యోతి, శ్రీవారు రామకృష్ణలలోని హాస్యం ఆవిడ ఎన్నో రచనలకు రామెటీరియల్ అంటూ ఉంటారు.

౩౭. **శ్రీనివాస్ ఫణికుమార్ డొక్కా**

స్థలం అమలాపురం. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటి, నుంచి M.S. Solid State Physics SPSU (Atlanta) నుంచి M.S.Computer Science చేసారు. ప్రస్తుత నివాసం అంట్లాంటా. ఇమెయిల్ - phanidokka@yahoo.com

౩౮. **సాయి బ్రహ్మానందం గొర్తి**

సాయి బ్రహ్మానందంగారు అమలాపురంలో జన్మించి, విశాఖపట్నంలో చదువుకుని ప్రస్తుతం కుపర్టినో, కాలిఫోర్నియా లో భార్య లలిత, పిల్లలు హర్ష, సుజయ్‌లతో కలిసి నివసిస్తున్నారు. కర్ణాటక సంగీతం, తెలుగు సాహిత్యం, సినిమాలు - క్రీడలు అభిరుచులుగా ఉన్న సాయిగారు ఇప్పటి వరకూ వివిధ పత్రికలలో, వెబ్ మాగజైనులలో అనేక శీర్షికలు, ౧౨ చిన్న కథలు, ఒక పెద్ద కథ, ౫ నాటకాలు, ౭ నాటికలు, ౩ రేడియో నాటికలు, ౧ పద్యనాటకం, ౬ వ్యాసాలు వ్రాయటంతో పాటు "జాజర" సూవనీర్‌కు, "వెన్నెల్లో హరివిల్లు" కథాసంపుటికి సంపాదకత్వం వహించారు.

౩౯. **డా.సుదర్శన్ రాజ్**

దుర్గాడలో పుట్టిన సుదర్శన్ రాజ్ గారు కాకినాడలో బి.ఎస్సీ, ఆగ్రాలో ఎమ్మెస్సీ, హైదరాబాదులో జెనిటిసిస్ట్‌గా పని చేసి, ప్రస్తుతం యార్క్ యూనివర్సిటీ నుండి సీనియర్ సైంటిస్ట్‌గా రిటైరై టొరాంటోలో భార్యయశోదారాజ్‌తో కలిసి ఉంటున్నారు. వందకు పైగా పరిశోధన వ్యాసాలు, "ప్రఖ్యాత శాస్త్రవేత్తలు" గ్రంధం పబ్లిష్ చేసారు. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, రచన, తానా పత్రిక, తెలుగుజ్యోతిలలో అనేక కధలు, గేయాలు, వ్యాసాలు ప్రచురించారు. తన రచనా వ్యాసంగానికి స్ఫూర్తి శ్రీ నార్లవెంకటేశ్వ రావు గారని అంటారు.

౪౦. **సౌమ్య**

హైదరాబాదులో చదువు ముగించి, "రిసెషన్ టైములో కెరీరు ప్రారంభించిన అదృష్టవంతుల్లో ఒకదాన్నని" చెప్పుకునే సౌమ్య గారికి చదవటం, వ్రాయటం ఆలోచనల్లోకి జారి తనను తాను కోల్పోవటం అంటే చాలా ఇష్టం. అంతే కాదు ఈమె ప్రముఖ బ్లాగరి. తన బ్లాగులో వివిధ విషయాలపై విరివిగా వ్రాయటమే కాక నవతరంగంలోనూ, పుస్తకం.నెట్ లోనూ తరచుగా వ్రాసే సౌమ్య, కధలు రాయటమంటే తనకు చాలా ఇష్టమని, తను రాయదలచుకున్నంత తరచుగా కధలు రాయలేకపోతున్నానని అన్నారు. *****